క్లుప్తంగా

భూమనకు అభినందనలు




కరుణాకర రెడ్డిని అభినందిస్తున్న రమ్య, విజయానాందరెడ్డి

గుడిపాల: టీటీడీ చైర్మన్‌గా నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య అభినందనలు తెలియజేశారు. మంగళవారం తిరుపతిలోని భూమన నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపటి నుంచి సమ్మె

చిత్తూరు కార్పొరేషన్: సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ డివిజన్ నాయకులు గోవింద్, యజ్ఞేశ్వరరావు తెలిపారు. బుధవారం సిమ్‌కార్డులను అందజేసి, 10 నుంచి నిరధిక సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కల్పించాలని ఎస్పీని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి కోరారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

చిత్తూరు కలెక్టరేట్: మెగా డీఎస్సీ నిర్వహించాలని మంత్రి బొత్స సత్యనారాయణను కోరామని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వినాయకం అన్నారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

వేడుకగా విరూపాక్షమ్మ జాతర



కొలువుదీరిన విరూపాక్షమ్మ

చిత్తూరు రూరల్: ఆడినెలను పురస్కరించుని నగరంలోని చవటపల్లిలో మంగళవారం విరూపాక్షమ్మ జాతరను వేడుక నిర్వహించారు. వేకువజామునే అమ్మవారిని నడివీధిలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. పెద్దల సమక్షంలో తొలిపూజను చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తర్వాత భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని నైవేద్యంగా అంబలి పోశారు. రాత్రి కుంభనైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పాడి రైతుల సంక్షేమానికి కృషి



పశువులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

గుడిపాల: పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బొమ్మసముద్రం పశువైద్యాధికారి రవితేజ అన్నారు. మండలంలోని గొల్లమడుగు గ్రామంలో మంగళవారం ఉచిత గర్భకోశ చికిత్స, చర్మవ్యాధులకు టీకాల కార్యక్రమం నిర్వహించారు. పాడి పశువులకు ఆయన వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. అనంతరం 300 ఆవులకు చర్మవ్యాధి టీకాలు వేశారు. గోపాలమిత్ర కిషోర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఈకేవైసీ



ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

గుడిపాల: రైతులకు సంబంధించి భూములను రీసర్వే చేసిన గ్రామాల్లో రైతుల నుంచి ఈకేవైసీ తీసుకోవడం ప్రారంభించినట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని చెరువుముందరవూరు, గుడిపాలక్రాస్‌లో మంగళవారం రైతులకు సంబంధించి భూములను రీసర్వే చేసిన తరువాత ఈకేవైసీని స్థానిక వీఆర్‌ఓ గోపీక్రిష్ణ రైతుల ఇంటివద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించారు.

ఆడికృత్తిక బస్సులు ప్రారంభం

చిత్తూరు రూరల్: ఆడికృత్తికను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని టూ డిపో పరిధిలో మంగళవారం తిరుత్తణికి ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. డిపో గేటు ఎదుట తిరుత్తణికి వెళ్లే భక్తుల సౌకర్యార్థంగా ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి సుబ్రమణ్యస్వామికి అధికారులు పూజలు చేశారు. ఈ ప్రత్యేక బస్సులను తిరుత్తణి వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డిపో మేనేజర్ అల్తాఫ్ కోరారు.

15న ప్రముఖులకు సత్కారం

చిత్తూరు రూరల్: ప్రజాహిత సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న పలువురు ప్రముఖులను సత్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు రాజరత్నం రెడ్డి తెలిపారు. నగరంలోని రెవెన్యూ భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, విద్యావేత్తలు పాల్గొనాలని కోరారు.

తలుపు తట్టిన పింఛన్



ఈ ఫొటోలో కనిపిస్తున్న దివ్యాంగుడు శేఖర్ రెడ్డి. ఈయన నడవలేరు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే వాళ్ల అమ్మ పనులన్నీ మానుకొని, ప్రత్యేకంగా రిక్షా మాట్లాడుకుని పంచాయతీ కార్యాలయానికి, పోస్టాఫీసుకో వెళ్లాల్సి వచ్చేది. గంటల తరబడి పడిగాపులు కాసేవారు. ఒక్కోసారి రోజంతా అక్కడే నిరీక్షించినా పింఛను చేతికందేది కాదు. ఇంటికొచ్చే సరికి శేఖర్‌రెడ్డి నీరసించి పోయేవాడు. మరుసటి రోజు వెళ్లాలంటే మళ్లీ ఇబ్బందులు పడాల్సిందే. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వం గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, వలంటీర్లను నియమించింది. దీంతో ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ ఇస్తుండడంతో సంతోషంగా ఉన్నారు.

నాడు

గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేస్తేనే అధికారులు కూడా పింఛను మంజూరు చేసేవారు. అందువల్ల ముందుగానే అర్హులైన వృద్ధులు జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకోవలసి వచ్చేది. దీంతోపాటు ఒక గ్రామంలో పింఛను తీసుకుంటున్న వ్యక్తి మరణిస్తేనే కొత్త పింఛను మంజూరు చేసేవారు. అది కూడా పంచాయతీ కార్యాలయాల వద్ద, పోస్టాఫీసు ప్రాంగణంలో, రచ్చబండవద్ద అధికారులు నెలలో ఏదో ఒక రోజు వచ్చి రూ.200 పింఛను ఇచ్చేవారు. ఆ పింఛను కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసేవారు. ఇచ్చే పింఛను డబ్బులో సగం రానుపోను ఖర్చులకే సరిపోయేవి.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే మొదటగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో పింఛన్ మొత్తాన్ని పెంచుతూ తొలి నిర్ణయం తీసుకున్నారు. ఆ పింఛన్ పంపిణీ చేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. ఆ వలంటీర్ల ద్వారా ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛను అందజేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతం పడినట్లు పింఛనుదారులకు ఒకటోతేదీ ఉదయాన్నే తలుపుతట్టి మరీ డబ్బులు చేతికిస్తున్నారు వలంటీర్లు. ఆ నిమిషం అవ్వా, తాత కళ్లలోని సంతోషం వెలకట్టలేనిది. జగనన్న ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని 2,250 మొదలుపెట్టి ఏటా పెంచుతూ వస్తోంది.

నాడు



చిటిపిరాళ్ల పంచాయతీ కార్యాలయంలో పింఛన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

నేడు



లబ్ధిదారుకు ఇంటి వద్దే పింఛన్ అందజేస్తున్న వలంటీరు



ఆస్పత్రిలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు

- జగనన్న ప్రభుత్వంలో పెనుమార్పులు
- నాడు పింఛన్ కోసం పడిగాపులు
- నేడు ఇంటి వద్దకే పంపిణీ

పూతలపట్టు: గ్రామ వలంటీర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. విధి నిర్వహణలో సేవా దృక్పథంతో వ్యవహరిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ సంక్షేమ పథకాల సేవలు ప్రజల గడప వద్దకే అందుతున్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇంటికొచ్చి వలంటీర్లు పింఛన్లు ఇచ్చి వెళుతున్నారు. ఒక్కప్పుడు కుల, ఆదాయ, జనన, మరణ, ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. నేడు సర్టిఫికెట్లు తీసుకెళ్లి ఇంటికే ఇస్తున్నారు. దీంతోపాటు నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూతలపట్టు మండలంలో పింఛన్ల సంఖ్య భారీగా పెరిగింది. పూతలపట్టు మండలంలో ప్రతి నెల 7,654 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.2,12,98,500 కోట్ల ప్రభుత్వం అందజేస్తుంది.

నాటి అగచాట్లు ఎన్నో

గతంలో పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పంచాయతీ కార్యాలయాల వద్ద ఇచ్చే పింఛన్ కోసం ముందురోజు రాత్రే అక్కడకు వెళ్లి పడిగాపులు కాసేవారు. వేలిముద్రలు పడకపోవడంతో రోజంతా అక్కడే వేచిఉండేవారు. ఆ పంచాయతీ కార్యాలయం వద్ద మొత్తం 40 పింఛన్లు ఉంటే ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఇస్తూనే ఉండేవారు. ఈ క్రమంలో పింఛన్ కోసం వెళ్ళి పడిగాపులు కాసి, కాసి సొమ్మసిల్లి పడిపోయి చనిపోయిన వారూ ఉన్నారు. గతంలో కొత్తగా ఎవరన్నా పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకోవాలన్నా, ఇంటి స్థలం, గృహ నిర్మాణం, ఇతర సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే సంబంధి కార్యాలయాలు, అధికారులు, నాయకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవారు. నేడు పథకాలైనా, సర్టిఫికెట్లు అయినా, పింఛను అయినా సరే వలంటీర్ల ద్వారా ఇంటికే అందుతోంది.

పింఛన్లు	లబ్ధిదారుల సంఖ్య	నెలవారీ మొత్తం
వృద్ధాప్య	4,479	1,23,17,250
వితంతు	1,329	36,54,750
ఒంటరి మహిళ	134	3,68,500
వికలాంగులు	1097	32,91,000
అభయహస్తం	167	83,500
నేతన్న నేస్తం	11	30,250
కల్లు గీత కార్మికుల	14	38,500
కళాకారులు	05	13,750
డప్పు కళాకారులు	322	9,66,000
డిహెచ్‌ఎం	89	4,45,000
డయాలసీస్	09	90,000

జగన్ రుణం తీర్చుకోలేనిది



గతంలో ఆ పింఛన్ ఇచ్చేది చాలు.. ఆ బాధలు చాలురా అనుకునేవాళ్లం. అప్పట్లో ఇచ్చే రూ.200, రూ.400 కే నానాపాట్లు పడేవాళ్లం. నా మనవడు జగన్ వచ్చాకా పింఛను 2250 రూపాయలైంది. ప్రతి నెలా ఒకటోతేదీనే వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛను అందజేస్తున్నారు. జగన్ రుణం తీర్చుకోలేనిది.

– బి.అడ్డెమ్మ, పాటూరు, పూతలపట్టు

వారి సంతోషానికి వెల కట్టలేం



మాకు ఇచ్చిన 50 కుటుంబాల పరిధిలోని లబ్దిదారులకు పింఛన్లు ఇస్తున్నా. వీరిలో ఒకరు పూర్తిగా నడవలేరు. నలుగురు అతి కష్టంగా నడవగలుగుతారు. వీరి ఇళ్లకు వెళ్లి వారికి పింఛన్ అందిస్తున్నప్పుడు వారి ముఖంలో ఎంత సంతోషమో. దానికి వెల కట్టలేం. అలాంటి సేవ చేసే అవకాశం జగనన్న నాకు ఇచ్చారు.

– బి.సురేంద్ర, వేపూతనపల్లి, పూతలపట్టు.

అర్హులందరికీ పింఛన్లు



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో అర్హత కలిగిన లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నాం. ప్రతి నెలా రూ.2 కోట్ల పింఛన్‌ను ప్రభుత్వం అందజేస్తుంది. ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీర్లు వారికి కేటాయించిన లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు తీసుకొస్తున్నాం.

–గౌరి, ఎంపీడీఓ , పూతలపట్టు

14న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకల లెక్కింపును ఈ నెల 14న సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో లెక్కించే ఈ హుండీ కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: వలంటీర్లు ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని యం.బండపల్లి సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రోజువారి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం వలంటీర్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై లబ్దిదారులకు తెలియపరచాలన్నారు. చాలా మందికి పథకాలు అందుతున్నాయి, కానీ వాటి గురించి పూర్తి వివరాలు తెలియడంలేదని చెప్పారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే వారి వివరాలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం గ్రామంలోని చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పని విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమలత, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్మికుల మానవహారం

చిత్తూరు కార్పొరేషన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం గాంధీవిగ్రహం వద్ద నిరసన తెలిపారు. పారిశుద్ధ్య , ఇంజనీర్ విభాగ కార్మికులు, డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడం లేదని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, లతారెడ్డి, చంద్ర, జయశంకర్, సురేష్, సుబ్రమణ్యం, పరదేశి, బుల్లెమ్మ, వినాయకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



డంపింగ్ యార్డులో పర్యటించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు డివిజన్లలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం ప్రజాప్రతినిధులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. 5వ డివిజన్ రఘురామ్‌నగర్‌కాలనీలోని బీపీఆర్ కాలనీ ప్రాంతానికి దారి సౌకర్యం కల్పించి రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. కట్టమంచి నుంచి సాంబయ్యకండ్రిగ రోడ్డు గుంతలమయంగా మారిందని, కొత్త రోడ్డు వేయాలని కాలనీవాసులు కోరారు. 6వ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ వెనుకవైపు స్వర్ణకారుల సంఘానికి కేటాయించిన స్థలం ఆక్రమించకుండా చూడాలని సంఘం నాయకులు కోరారు. ఆ స్థలాన్ని రీసర్వే చేసి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. 8వ డివిజన్ కుమార్‌నగర్ కాలనీలో నివాసముంటున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేయాలని స్థానికులు కోరారు. డివిజన్‌లో డ్రైనేజీ కాలువలు నిర్మించి ఇవ్వాలని విన్నవించారు. 47వ డివిజన్ మంగసముద్రం హౌసింగ్‌కాలనీ వాసులకు సీతమ్స్ కళాశాల సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో శ్మశానవాటికను ఏర్పాటు చేసి వసతులు కల్పించాలన్నారు. డంపింగ్‌యార్డును మరో ప్రాంతానికి మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ అరుణ, తహసీల్దార్ మురళీమోహన్, డీటీ కిరణ్, సర్వేయర్ జయచంద్రా, ఎంహెచ్‌ఓ లోకేష్, కార్పొరేటర్లు హరిణిరెడ్డి, అజగరీ భాను, షర్మిల, జ్ఞానజగదీష్ నాయకులు చాన్‌బాషా, కృష్ణారెడ్డి, కిరణ్, సరళ, సీతాపతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ వ్యానును ఢీకొన్న కారు

పూతలపట్టు: స్కూల్ వ్యానును కారు ఢీకొన్న సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు చిత్తూరులోని ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన స్కూల్ వ్యాను విద్యార్థులను తీసుకొని పూతలపట్టు మండలం ముత్తిరేవుల ఫ్లై ఓవర్ దిగి మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో వ్యానులోని విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. కారులోని ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

భక్తితో భరిణి కావళ్ల చెల్లింపు



తవణంపల్లె: కావళ్లతో వెళుతున్న భక్తులు

గుడిపాల: హరోహర నామాలతో గ్రామాలు హోరెత్తాయి. భరణి కావళ్ల నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి భక్తులు ఉపవాసాలతో సుబ్రమణ్యస్వామికి పూజలు చేసి, కావడి మొక్కులు చెల్లించుకున్నారు. బసవాపల్లె, ముత్తువాళ్లూరు, గుడిపాల, ముట్టుకూరుపల్లె, పాపసముద్రం, అడవిచేను గ్రామంలో కావళ్ల ఎత్తుకున్న భక్తులకు కందగిరి సుబ్రమణ్యస్వామి, వళ్లిమలైకి తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

అరగొండ దేవస్థానంలో..

తవణంపల్లె: మండలంలోని అరగొండ శ్రీ స్వయంభు భువనేశ్వర కుమార స్వామి దేవస్థానంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో భరణి కావళ్లు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో సుబ్రమణ్యం స్వామి, శివలింగానికి అర్చకులు అభిషేకం, అలంకరణ, పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులు కావడి మొక్కులు తీర్చుకున్నారు. తవణంపల్లెలో వెలసిన సుబ్రమణ్యం స్వామి దేవస్థానంలో భక్తులు స్వామికి పూజలు చేసి కావళ్లు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. అరగొండలో బుధవారం ఆడికృత్తిక పూజలు, కావడి చెల్లింపులుంటాయని కార్యనిర్వహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో భరణి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం చెంగాలాయ కొండపై వెలసిన శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం భరణి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలస్థానంలోని స్వామి వారికి అభిషేక పూజలను చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు కావళ్లతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు దీపారాధన చేసి వ్రతం ఆచరించారు. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



బసవాపల్లె గ్రామంలో భరణి కావళ్లను తీసుకెళ్తున్న భక్తులు



అలంకరణలో శ్రీసుబ్రమణ్యస్వామి

మైనారిటీల అభ్యున్నతికి కృషి



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రీనివాసులు, మైనారిటీ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: మైనారిటీల అభ్యున్నతికి సర్కారు కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మైనారిటీల సమస్యలు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం ఆయన కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సమీపంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, వసతి గృహానికి స్థల కేటాయింపు, ఉర్దూ అకాడమీ నైపుణ్యాల కేంద్రం అమలు, ఉర్దూ షాదీ ఖానా మరమ్మతులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి చిన్నారెడ్డి, జిల్లా అంజుమన్ ఉర్దూ కమిటీ అధ్యక్షులు రషీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గని, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు గఫార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రియ మృతి చాలా బాధాకరం



సుప్రియ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: సుప్రియ మృతి చాలా బాధాకరమని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. కట్టకిందపల్లె దళితవాడలో వలంటీర్‌గా పనిచేస్తున్న బాలాజి భార్య సుప్రియ(22) ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. సమాచారమందుకున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థిక పురోభివృద్ధి



విక్రయదారులను సన్మానిస్తున్న మేయర్ అముద, కమిషనర్ అరుణ

చిత్తూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని నగర మేయర్ అముద, కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. నగరపాలక కార్యాలయంలో మంగళవారం ప్రధానమంత్రి స్వానిధి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ పీఎం స్వానిధి పథకాన్ని నగరంలోని చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడడం హర్షించదగ్గ విషయం అన్నారు. రుణాలను తిరిగి చెల్లించడం ద్వారా బ్యాంకులు మరింత నమ్మకంతో మళ్లీ రుణాలు ఇస్తాయన్నారు. పీఎం స్వానిధి ద్వారా రుణాలు పొంది డిజిటల్ పేమెంట్ ద్వారా రుణాలు తిరిగి చెల్లించిన ముగ్గురు వీధివిక్రయదారులు బాబు, సర్దార్, తిలకవతిని శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. నగరపాలక సంస్థ పరిధిలో పీఎం స్వానిధి రుణాలు విరివిగా అందించిన ఆరుగురు బ్యాంకు మేనేజర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రాధమ్మ, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఎల్డీఎం హారిస్ సీఎంఎం గోపి, బ్యాంక్ మేనేజర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యమే లక్ష్యం



రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ ధాత్రేయచౌదరి



గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్



ఐరాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి తెలిపారు. మండలంలోని సరకల్లు, మైనగుండ్లపల్లె గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మైనగుండ్లపల్లెలో వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి, సరకల్లులో వైద్యాధికారి మోహన్‌వేలు 110 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 104 మొబైల్ క్లినిక్‌లో గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు నాగభూషణ, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు భార్గవి, లావణ్య, డీఈఓ మహేష్, జగదీష్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


పాపసముద్రంలో వైద్యశిబిరం

గుడిపాల: ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని పీహెచ్‌సీ డాక్టర్ సందీప్ అన్నారు. మండలంలోని పాపసముద్రంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, చంద్ర, కవిత, రుక్మిణి, బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

పాలకల–2లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ఐరాల: మండలంలోని పాలకల–2లో ఫ్యామి లీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత 104 వైద్య శిబిరంతో 90 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

తవణంపల్లె: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, పీహెచ్‌ఎన్ భారతి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ హరిరెడ్డి చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా 5 ఏళ్ల లోపల పిల్లలకు టీకాలు వేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీహరి, అముద, ఎంఎల్‌హెచ్‌పీలు, వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్‌బాబురెడ్డి, మధుకుమార్, ప్రకాష్‌బాబురెడ్డి, పరమేశ్వర రెడ్డి, వాసు, విజయకుమార్ రెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.